## క్లుప్తంగా

### అతడి కళ్లు సజీవం..



నారాయణ (ఫైల్)

కమలాపూర్ : భౌతికంగా అతను సజీవంగా లేకున్నా అతని కళ్లు మాత్రం సజీవంగానే ఉన్నాయి.. మరో ఇద్దరికి చూపునిచ్చాయి. వివరాలిలా.. మండల కేంద్రానికి చెందిన చందనాల నారాయణ (97) అనారోగ్య కారణాలతో కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని కమలాపూర్‌కు తరలించగా అతడి కుటుంబ సభ్యుల అంగీకారంతో సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి టెక్నీషియన్ లక్ష్మణ్ సహకారంతో గురువారం రాత్రి నారాయణ నేత్రాలు సేకరించి హైదరాబాద్‌కు పంపించారు. కాగా ఆ నేత్రాలను ఇద్దరు అంధులకు అమర్చి చూపునిచ్చినట్లు ఆస్పత్రి వైద్యులు శుక్రవారం వెల్లడించారు. తమ తండ్రి నేత్రాలు దానం చేయడానికి అంగీకరించి ఇద్దరు అంధులకు చూపునిచ్చిన నారాయణ కుటుంబ సభ్యులకు ఆస్పత్రి వర్గాలు కృతజ్ఞతలు తెలిపాయి.

### పరామర్శ

దామెర : ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుండు రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. శివాజీపై దాడి దుర్మార్గమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో మటిక సంతోష్, ఊరుగొండ మాజీ ఎంపీటీసీ గండు సుదర్శన్, రామకృష్ణాపురం సర్పంచ్ పెండ్లి రాజు, యార లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కేసు నమోదు

శాయంపేట : మహిళను దూషించి భౌతిక దాడికి పాల్పడ్డ వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని మాందారిపేట గ్రామానికి చెందిన మసికె స్వప్నకు చెందిన భూమి వద్ద అదే గ్రామానికి చెందిన కొమ్ముల జీవన్, మల్లికార్జున్ పని చేస్తుండగా ఆమె ప్రశ్నించింది. దీంతో పాత గొడవలను దృష్టిలో పెట్టుకుని జీవన్, మల్లికార్జున్ అక్కడకు ఎందుకొచ్చావంటూ దూషించి భౌతికదాడికి పాల్పడ్డారు. వారితోపాటు రేణిగుంట్ల ఐలయ్య, అతడి కుమారుడు హనుమంతు సైతం స్వప్నను దూషించి కొట్టినట్లు ఫిర్యాదు చేయగా వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

### గీత కార్మికుడికి గాయాలు



కమలాపూర్ : మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన గీత కార్మికులు పంజాల శ్రీధర్ శుక్రవారం ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఆయన కుల వృత్తిలో భాగంగా కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయాడు. శ్రీధర్‌ను ఆస్పత్రికి తరలించారు.

### 'బలగం' చిత్రప్రదర్శన

ఎల్కతుర్తి : మండలంలోని పెంచికలపేట గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో సర్పంచ్ సామెల జమున సురేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో సామల రాజిరెడ్డి, అమృతమ్మ, సామెల నాగవ్వ జ్ఞాపకార్థం 'బలగం' చలనచిత్రాన్ని శుక్రవారం ప్రదర్శించారు. గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి చిత్రాన్ని తిలకించారు. చిత్రంలోని పలు సన్నివేశాలను చూస్తూ గ్రామస్తులు కంటతడి పెట్టడం కనిపించింది. వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### కాగడాల ప్రదర్శన



ధర్మసాగర్ : వైఎస్‌ఆర్‌టీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు టేకుమట్ల విష్ణు మాట్లాడారు. వెంటనే లక్షా 91 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, ప్రశ్న పత్రాల లీకేజీకి పాల్పడుతున్న నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో నాయకులు నంగునూరి రాజు, కొట్టె అనిల్‌కుమార్, మేకల నగేశ్ యాదవ్, క్లైపు రాజు, బండి కుమారస్వామి, కనుకుంట్ల కృష్ణ, ఆవుల సతీశ్ యాదవ్, జహంగీర్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖిలా వరంగల్: మద్యం అనుకొని పొరపాటున ఫినాయిల్ తాగి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వరంగల్ డాక్టర్ కాలనీకి చెందిన షేక్ బియాబానీ (55) ఈనెల 5న మధ్యాహ్నం ఖాళీ సీసాలో ఉన్న ఫినాయిల్‌ను మద్యం అనుకొని తాగాడు. అతడు స్పృహ కోల్పోగా ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముస్కు శ్రీనివాస్ తెలిపారు.

# ఊరూరా గుడ్‌ఫ్రైడే వేడుకలు



పరకాల : యేసుక్రీస్తు సిలువతో వస్తున్న భక్తులు



ఐనవోలులో..



ఎల్కతుర్తిలో..



ఆత్మకూరులో..



దామెరలో..

పరకాల : పట్టణంలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యేసు సిలువ యాత్రను క్రైస్తవులు ఊరేగించారు. దివ్యకారుణ్య యేసు దేవాలయం నుంచి ప్రారంభమైన యాత్రలో కౌన్సిలర్ యేసు క్రీస్తు సిలువతో పాల్గొనగా క్రైస్తవులు పాల్గొని లోక రక్షణ కోసం యేసు క్రీస్తు చేసిన త్యాగాలను స్మరిస్తూ సంతాపం తెలిపారు. వేడుకల్లో 13వ వార్డు కౌన్సిలర్ శనిగరపు రజని, ఫాదర్ గంగారపు నవీన్, సిస్టర్లు మేరిస్ ఆగి, లేడియా, జాయిస్ మరియా, సవిత, సంఘ పెద్దలు బొచ్చు చంద్రశేఖర్, నాగెల్లి సుగుణ, దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయం నుంచి కారుణ్యమాత క్యాథలిక్ చర్చి వరకు క్రైస్తవ మతస్తులు యేసు క్రీస్తు నామాన్ని స్మరిస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఏసు క్రీస్తు వేషాదారణలో వ్యక్తి శిలువను మోస్తూ చేసిన ప్రదర్శన భక్తులను కంటతడి పెట్టించింది. క్రైస్తవ మహిళలు బిందెలతో నీళ్లు తెచ్చి యేసు క్రీస్తు వేషధారి కాళ్లపై పోసి నమస్కరించారు. క్రైస్తవ మహిళలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ నవీన్, శివకుమార్, జయరాజ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండలవ్యాప్తంగా క్రైసవులు గుడ్‌ఫ్రైడే జరుపుకున్నారు. సిలువ శిక్షకు గురైన క్రీస్తు సిలువలో పలికిన మాటల గురించి పాస్టర్లు వివరించారు. కొండపర్తిలోని పునీత బోజప్ప ఆలయంలో చేపట్టిన సిలువ మార్గంలో దేవుని ఆత్మ సూర్యుని చుట్టూ ఆవరించి ఉన్న సంఘటన (రింగ్) వెలుగులోకి వచ్చినట్లు భక్తులు తెలిపారు. సింగారం విచారణ గురువులు దాసరి జోసెఫ్, ఫాదర్ రాయన్న, బ్రదర్ ఉమేష్ మాట్లాడారు. ఉపదేశి ఆరాధనలో 7 మాటల గురించి వివరించారు. రెడ్డిపాలెం చర్చిలో పాస్టర్లు ప్రసంగించారు. మండల కేంద్రంలోని బాప్టిస్టు చర్చిలో సంఘ కాపరి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా చర్చిల్లో గాయకులు సిలువ పాటలను పాడగా నాటక బృందం నాటికలు ప్రదర్శించి అలరించింది.

ఆత్మకూరు : మండల కేంద్రంలో మేరీ మాత ఆలయం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. క్రైస్తవులు యేసుక్రీస్తు సిలువయాత్ర చేపట్టారు. క్రీస్తు నామస్మరణ చేశారు.

దామెర : మండలంలోని పులుకుర్తి గ్రామంలోని పునీత జాన్ బ్రిట్టో దేవాలయంలో ఫాదర్ రవిప్రశాంత్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. సిలువ మార్గంలో పునీత జాన్ బ్రిట్టో దేవాలయం నుంచి చెరువు వద్ద కొండపైకి శిలువ యాత్రను కొనసాగించారు. వేడుకల్లో వార్డు సభ్యులు గోవిందు సరోజన, శాంతికుమార్, జిల్లెల కృష్ణవేణి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

## పాలకులకు ఓటుతో బుద్ధి చెప్పాలి

● టీపీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణ



యాత్రలో గండ్ర సత్యనారాయణ, తదితరులు

శాయంపేట : రానున్న ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాల్సిందేనని టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జీ గండ్ర సత్యనారాయణరావు చెప్పారు. మండలంలోని నూర్జాహాన్‌పల్లి, కాట్రపల్లి, సాధనపల్లి, రాజుపల్లి, పత్తిపాక, హస్సేన్‌పల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'హథ్ సే హాథ్ జోడో' యాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన చేపట్టి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రచారం చేయడంతోపాటు ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. ఆయా గ్రామాల్లో పార్టీ జెండాలను గండ్ర సత్యనారాయణరావు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి ఓటేసి గెలిపిస్తే పేదలకు రూ. 500లకే వంట గ్యాస్, పేద కుటుంబాలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి భూపాలపల్లిలో తన అక్రమ సంపాదన మొత్తం ఖర్చు పెట్టినా ప్రజలు ఓటేసే పరిస్థితి లేదన్నారు. ఎన్నికలెప్పుడొచ్చినా భూపాలపల్లిలో ఎగిరేది కాంగ్రెస్ జెండాయేనేని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి అసెంబ్లీ నియోజవకర్గ కోఆర్డినేటర్ మార్క విజయ్‌గౌడ్, మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు బుజ్జన్న, రవి, రమేశ్, కట్టయ్య, నాగరాజు, విష్ణు, మల్లికార్జున్, వలీ హైదర్, కృష్ణమూర్తి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ గ్రామంలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాటపోలు శ్రీనివాస్, ఉపాధ్యాక్షులుగా గుగులోతు లక్ష్మణ్, కోతి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా సిద్దుమల్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా గూటం బాబు, జోడుమంతల రమేశ్, కోశాధికారిగా ఉప్పుల కుమారస్వామి, కార్యవర్గ సభ్యులుగా కిరణ్, శంకర్, విజయ్, వెంకటేశ్, కృష్ణ, శ్రీకాంత్, వేణు, స్వామి, కార్తీక్, ముఖ్య సలహాదార్లుగా సమ్మయ్య, చంద్రమౌళి, రాజమౌళి, రమేశ్, కోటేశ్వర్‌రావు, కుమారస్వామి, వెంకటస్వామి, సంపత్, ప్రభాకర్ ఎన్నికయ్యారు.

### ఐక్యతతోనే అభివృద్ధి



ఆత్మకూరు : ఐక్యంగా ఉంటేనే పద్మశాలి కులస్తుల అభివృద్ధి సాధ్యమవుతుందని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చందా మల్లయ్య తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించగా ఆయన మాట్లాడారు. సభ్యులు సంఘం బలోపేతానికి తోడ్పాటు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాశికంటి రాజేంద్రప్రసాద్, మండల అధ్యక్షుడు వెల్దె వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి ఇర్సడ్ల సదానందం, మండల ఉపాధ్యక్షుడు పాపని రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సదానందం, ఆత్మకూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు వడ్డెపల్లి వేణుగోపాల్, నాయకులు బూర రాజేందర్, చిమ్మని భిక్షపతి, మార్త రంజిత్, ఇర్సడ్ల కుమార్, అలువాల రవి, బలభద్ర కిశోర్, కొంపెల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

## అనుదీప్ శర్మకు జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న అనుదీప్ శర్మ

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని రాజరాజేశ్వర ఆలయ అర్చకుడు అనుదీప్ శర్మ వేద వైదిక పురోహిత భాస్కర బిరుదుతోపాటు ఉత్తమ జాతీయ నంది పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభలోని సమావేశ మందిరంలో శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శోభకృత నామ ఉగాది పురస్కార మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రంలోని 12 మంది అర్చకులను ఉత్తమ జాతీయ నంది పురస్కారంతో సత్కరించారు. ఈ క్రమంలో పెద్దకోడెపాకకు చెందిన తాటిపాముల అనుదీప్ శర్మ కాకతీయ కాలంలో నిర్మించిన రాజరాజేశ్వర ఆలయాన్ని అభివృద్ధి చేయడమే కాక కాల సర్ప దోషాలకు ప్రత్యేక పూజలు చేస్తూఆలయాల్లో చేస్తున్న సేవలు గుర్తించి వేద వైదిక పురోహిత భాస్కర బిరుదుతోపాటు ఉత్తమ జాతీయ నంది పురస్కారాన్ని రాష్ట్ర టూరిజం చైర్మన్ ఉప్పాల శ్రీనివాస్ గుప్తా, బీజేవైఎం ఈసీ మెంబర్, ఉంగ్రో సీఈవో రూప సుధాకర్‌రెడ్డి, జనగాం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అరుణరెడ్డి, మల్కాజ్‌గిరీ కోర్టు మేజిస్ట్రేట్ బూర్గుల మధుసూధన్‌రావు, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి గొల్ల కృష్ణ, చిట్టి రామశర్మ చేతుల మీదుగా అందజేశారు. అనుదీప్ శర్మను స్థానిక సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి, ఎంపీటీసీలు వావీలాల వేణుగోపాల ప్రసాద్, మాచర్ల మంగమ్మ రవి, తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకుడు అమ్మ అశోక్, పురోహితులు పల్నాటి జలంధర్, పలువురు నాయకులు అభినందించారు.

## లక్షా ఆరువేల ఎకరాలకు సాగునీరు

● ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

ఎల్కతుర్తి : రాబోయే నెలరోజుల్లో గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి నీళ్లు నింపి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా లక్షా 6వేల ఎకరాలకు సాగునీరందిస్తామని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామంలోని వెంకటసాయి గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొద్దిరోజుల్లో మెట్ట ప్రాంతమైన భీమదేవరపల్లి నేల గోదావరి జలాలను ముద్దాడనుందని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి చూపిస్తామని తేటతెల్లం చేశారు. 'స్వరాష్ట్రంలో హనుమంతుడు లేని గూడులేదు, సంక్షేమ పథకం చేరని ఇల్లు లేదన్నారు. అభివృద్ధిలో సైతం తెలంగాణ రాష్ట్రాన్ని ముందంజలో నిలుపుతున్న ఏకైక సీఎం కేసీఆర్ ఒక్కరే..' అని కొనియాడారు. భీమదేవరపల్లి మండలంలో బలమైన పార్టీ ఏదీ అని అడిగితే బీఆర్‌ఎస్ పార్టే అని స్పష్టం చేశారు. అన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి మరింతగా బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు వంగ రవిందర్, ఎంపీపీ జక్కుల అనితరమేష్, మాజీ ఎంపీపీ సంగ సంపత్, సర్పంచ్ కొమురయ్య, ఎల్కతుర్తి సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, పద్మ, రమేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### వీధి బాలలకు పండ్ల పంపిణీ

కాశిబుగ్గ: వరంగల్ నగరంలోని శివనగర్ ప్రాంతంలోని డాన్‌బాస్కో నవజీవన్ వీధి బాలల పాఠశాలలో వరంగల్‌కు చెందిన జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు రహీంఖాన్ మాట్లాడారు. ఫౌండేషన్ జాతీయ నాయకుడు మహ్మద్ మునీర్ అహ్మద్ షరీఫ్ జన్మదినం, గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని వీధి బాలలకు పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సందెల లాజర్, బల్లు శ్రీధర్, డాన్‌బాస్కో నిర్వాహకులు రాజు, దివ్య, ఉల్లాస, అనిత, భారతి, శారద తదితరులు పాల్గొన్నారు.

### ఇఫ్తార్ విందు

వరంగల్ చౌరస్తా: వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఓ హోటల్ అంబుజా ప్లేస్ సిమెంట్ తెలంగాణ డిస్ట్రిబ్యూషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు జరిగింది. కార్యక్రమంలో నిర్వాహకులు కృష్ణప్రసాద్, శివకుమార్, వేణు, కార్తీక్, ఇంజనీర్లు, డీలర్లు, ముస్లింలు పాల్గొన్నారు.

## సీకేఎంలో కానరాని నిర్వహణ

వరంగల్‌లోని సీకేఎం ఆస్పత్రిలో నిర్వహణను గాలికొదిలేశారు. దాంతో ఆస్పత్రిలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. తినిపారేసిన కంచాలు, విరిగిన మంచాలు, ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, దుర్వాసన వెదజల్లుతున్న మరుగుదొడ్లతో గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, వరంగల్



హాస్పిటల్ ఆవరణలో పోగైన చెత్తకుప్ప



ఆవరణలో తినిపారేసిన విస్తార్లు, భోజనం



లీకైన సెప్టిక్ ట్యాంక్



ఆరుబయట విరిగిన మంచాలు



పెరిగిన పిచ్చి మొక్కలు

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ : పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఉప్పల్, దేశరాజుపల్లి, కానిపర్తి, శంభునిపల్లి, నేరెళ్ల, శనిగరం, వంగపల్లి, మర్రిపల్లిగూడెం, గుండేడు, కన్నూరు, భీంపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి 22 మంది లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి కల్యాణలక్ష్మీ, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల అవసరాలకు అనుగుణంగా పథకాలను రూపొందించి సమర్థవంతంగా అమలు చేస్తోందని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తడక రాణి శ్రీకాంత్, పీఏసీఎస్ డైరెక్టర్ సత్యనారాయణరావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సంపత్‌రావు, మాజీ జెడ్పీటీసీ నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలను కాపాడుకుంటా

● పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



కండువా కప్పుడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన పలువురు యాదవ సంఘం నాయకులు, వివిధ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో ఆయన నివాసంలో శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే ధర్మారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతోందని తెలిపారు. యాదవ కులస్తుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గొల్ల, కురుమల సంక్షేమానికి చొరవ తీసుకుంటానని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు వంగాల భగవాన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అంకూస్, ఆత్మకూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు పాపని రవీందర్, కాడబోయిన మొగిలి పాల్గొన్నారు.

## బీజేపీతోనే బీసీల సమగ్రాభివృద్ధి

● ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, తదితరులు

పరకాల : బీజేపీ ద్వారానే బీసీల సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ అనుబంధ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నాంపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆ పార్టీ జాతీయ కమిటీ పిలుపు మేరకు ×పల్లెపల్లెకు ఓబీసీ.. ఇంటింటికీ బీజేపీ..॰ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను పట్టణంలో ఆయన శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో 55 శాతానికిపైగా ఉన్న బీసీలకు పెద్దపీట వేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందని తెలిపారు. రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీలను అణిచివేస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. బీసీలకు సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలు బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీల ప్రయోజనాలే లక్ష్యంగా జాతీయ బీసీ కమిషన్ ఏర్పాటు చేయడంతోపాటు చట్టబద్ధత కల్పించిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 27 మంది బీసీలకు మంత్రి పదవులు ఇచ్చిందన్నారు. విద్యార్థులకు సైనిక్, నవోదయ, కేంద్ర విద్యాలయాల్లో రిజర్వేషన్ కల్పించడం అభినందనీయమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి, బీజేపీ పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి గాజుల నిరంజన్, ఉపాధ్యక్షుడు సంగా పురుషోత్తం, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు ఆకుల రాంబాబు, బీజేపీ నాయకులు దంచనాల సత్యనారాయణ, ముత్యాల దేవేందర్, సమిండ్ల శశిధర్, నారయణదాసు, కరుణాకర్, అల్లె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రవి

శాయంపేట : కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని సర్పంచ్ కందగట్ల రవి తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో లేబర్ కార్డు కలిగిన కార్మికుల కోసం ప్రభుత్వం, సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. భవన నిర్మాణ రంగ కార్మికుల కోసం వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్మికులు ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య, ఇతర సదుపాయాలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 74 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకుడు సాయిరాం మాట్లాడారు. నేడు (శనివారం), రేపు (ఆదివారం) శిబిరం కొనసాగుతుందన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులు వైద్యశిబిరాన్ని వినియోగించుకుని అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, సీఎస్‌సీ హెల్త్‌కేర్ సిబ్బంది రాధిక, రవితేజ, సందీప్ పాల్గొన్నారు.

## అంబేడ్కర్ విగ్రహ కమిటీ నిరసన



మాట్లాడుతున్న గద్దల సుకుమార్

ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయకుండా అడ్డుకుంటున్నారంటూ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణ స్థలంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ గద్దల సుకుమార్, ఎంఎస్పీ వర్ధన్నపేట ఇన్‌చార్జ్ బొక్కల నారాయణ మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కులమతాలకు అతీతంగా అందరూ సహకరించాల్సింది ఉండగా కొందరు అడ్డుకుంటున్నారని ఆందోళన వెలిబుచ్చారు. అడ్డు తగులుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో విగ్రహ కమిటీ అధ్యక్షుడు మాదాసి మల్లేశం, ఉపాధ్యక్షుడు బొక్కల అనిల్, నాయకులు గుడ్డేటి బాబు, రడపాక భాస్కర్, కట్కూరి ప్రవీణ్, కట్కూరి రమేష్, సింగారపు చంద్రమౌళి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక లారీ బోల్తా.. నలుగురికి గాయాలు



పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడిన ఇసుక లారీ

మామునూరు: వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఓ ఇసుక లారీ వేగంగా వెళ్తూ అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు కూలీలు, డ్రైవర్, క్లీనర్ గాయాల పాలయ్యారు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున ఖిలా వరంగల్ మండలంలోని మామునూరు గ్రామ చెరువు కట్ట వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గోదావరి ఇసుకు డంపు చేయడానికి వరంగల్ నుంచి ఐనవోలు క్రాస్‌రోడ్డుకు ఇసుక లారీ బయల్దేరింది. ఈక్రమంలో మామునూరు చెరువు కట్ట వద్దకు ఇసుక లారీ చేరుకోగా మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోతూ అదుపుతప్పి పంటపొల్లాలోకి లారీ దూసుకెళ్లి బోల్తా పడింది.